# అమెరికా అబ్బాయి

కొత్త రవీంద్రబాబు

కొద్దిగా తలవంచుకుని మండువాహాలులోకి నెమ్మదిగా నడుచుకుంటూ వచ్చిన లోలితను మూడు జతల కళ్ళు అతి నిశితంగా పరిశీలించాయి.

పై కవర్లు చిరిగిపోతున్న పాత సోఫాల్లో కూర్చున్న మూడు జతల కళ్ళ తాలూకు మనుష్యులలో ఒక జత కళ్ళు పాతిక సంవత్సరాల వయసుగల సుందరరావువి. మిగిలిన రెండు జతల కళ్ళు అతని తల్లితండ్రులవి.

సుందరరావు కళ్ళు రెప్పలార్పకుండా లోలితను చూడసాగాయి.

లేత గులాబులు పచ్చగన్నేరు పూలు కలిపి కట్టిన గుచ్ఛంలా ఎరుపురంగు నింపుకున్న పసిమి మేనిఛాయతో మెరిసిపోతున్న లోలిత ముఖ వర్ఛస్సును- ఎడారిలో ప్రయాణించే పాంథుడు ఒయాసిస్సు వంక ఆబగా చూసినట్లు చూడసాగాడు సుందరరావు.

స్వతహాగా అనాకారి అయిన సుందరరావు గొప్ప సౌందర్యారాధకుడు. అతనికి లోలిత ముఖం జాతి కెంపు కిరణాలు ప్రతిఫలించిన మేలిమి బంగారు విగ్రహం ముఖంలా కనపడింది.



అతనికి చిన్నప్పుడు చెరువుగట్టున చూచిన మెట్టతామర మొగ్గ గుర్తొచ్చింది లోలిత ముఖం చూస్తుంటే.

లోలిత వంకే చూస్తున్న సుందరరావు హంటరుదెబ్బకు హడలిపోయే పెంపుడు కుక్కలా ఉలికిపడ్డాడు.

నెమ్మదిగా తన వీపు చరచిన తండ్రి చూపులు అప్రసన్నంగా వున్నవని తెలుసుకోగానే లోలిత మీద నుండి దృష్టి మరల్చి అప్పుడప్పుడూ దొంగ చూపులు చూడసాగాడు.

పట్టుపంచ, సిల్కు లాల్చీ, జరీ కండువా వేసుకున్న సుందరరావు తండ్రి నందయ్య కళ్ళు పడిపోడానికి సిద్ధంగా వున్న పై కప్పువంక, పెచ్చులూడుతున్న గోడలవంక మార్చి మార్చి చూడసాగాయి.

సుందరరావు తల్లి కళ్ళు ముచ్చటైన లోలిత విగ్రహాన్ని, ఆమె కట్టుకున్న సాదా వాయిల్ చీరెను మార్చి మార్చి చూడసాగాయి.

"ప్చ్! వంటి మీద నాలుగు కాసుల బంగారమైనా లేదు! చెవులకు నీరు దిగిన కమ్మలు. మెళ్ళో సన్నటి గొలుసు-చేతికి ఒకే ఒక పల్చటి గాజు- ఈ అమ్మాయికే కట్టి వంటినిండా ఆభరణాలు దిగేస్తే లక్ష్మీదేవిలా వుంటుంది" అనుకుంది సుందరరావు తల్లి బసవమ్మ.

ఆమె కళ్ళు తిప్పి భర్తవంక సాలోచనగా చూడబోయే క్షణాన "మియావ్ యావ్" అంటూ లోపలకు వచ్చింది అడ్డంగా బలిసిన గండుబిల్లి.

"రామ్మా లిల్లీ రా! అక్కడే నిలబడ్డావేం?" లాలనగా పిల్చింది బసవమ్మ.

లోలిత, తల్లి, తండ్రి ఆశ్చర్యంగా చూస్తుండగానే నందయ్య "రా లిల్లీ" అని సోఫా పక్కన వున్న పాతకాలంనాటి చెక్కకుర్చీ చూపించాడు.

తల విదిలించి వళ్ళు విరుచుకుని అతి నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ కుర్చీని సమీపించిన లిల్లీ కుర్చీని ఎగాదిగా చూచి నిలబడిపోయింది.

"మావగారూ-మా లిల్లీ సోఫాలో తప్ప కూర్చోదు. మీ ఇంట్లో మెత్తటి డన్‌లప్ దిండువుంటే తెచ్చి కుర్చీలో వేయండి. కారులో ప్రయాణంచేసి లిల్లీ అలసిపోయివున్నది!" అన్నాడు నందయ్య లోలిత తండ్రి సుబ్బారావుతో.

"అలాగేనండీ" అంటూ తత్తరపాటుగా పడమటింట్లోకి నడచి పందిరిమంచంమీద వున్న దూది దిళ్ళలో మెత్తటి దిండు తీసుకుని తిరిగి వచ్చి దిండును చెక్కకుర్చీలో వేసాడు సుబ్బారావు.

రంగువెలసిన దిండు కవర్‌వంక పరీక్షగా చూచి సగం కళ్ళుమూసుకుని ఒక్క ఉదుటున ఎగిరి కుర్చీలోని దిండు మీద కూర్చుని కళ్ళు పూర్తిగా మూసేసుకున్న లిల్లీ ముఖం అప్రసన్నంగా మారింది.

"అరేయ్ రంగా" పెద్దగా అరిచాడు నందయ్య.

"సార్ పిలిచారా?" అంటూ లోపలకొచ్చాడు నడివయసు వ్యక్తి.

"లిల్లీ దూది దిండు మీద కూర్చోలేకుండా వుంది. కార్లో డన్‌లప్ దిండు తెచ్చి కుర్చీలో వెయ్యి" అన్నాడు నందయ్య గొంతులో వెటకారాన్ని దాచుకునే ప్రయత్నం చెయ్యకుండా.

రంగడు నైలాన్ కవరున్న డన్‌లప్ దిండు తెచ్చి లిల్లీ వున్న కుర్చీ ముందు నిలబడి దిండు ఎడమ చేతి చంకలో వుంచుకుని కుడిచేత్తో బహు అపురూపమైన గాజు సామాను పుచ్చుకుని ఎత్తినట్లు లిల్లీని ఎత్తి ఎడంచేత్తో దూదిదిండును తీసి గొంగళి

వురుగును విదిలించినట్లు దూరంగా విసిరేసి లిల్లీని ఎడంచేతిలోకి మార్చుకుని డన్‌లప్‌దిండు కుర్చీలో వేసి లిల్లీని దిండుమీద కూర్చోపెట్టి వెళ్లాడు.

'హంసతూలికా తల్పం మీద తప్ప పడుకోని యువరాణిని-నులకమంచం మీద పడుకోబెట్టా వింతసేవూ!' అన్నట్లు చురుగ్గా సుబ్బారావు కళ్ల లోకి చూచి కనులరమూసుకుంది లిల్లీ.

చేదు మాత్ర మింగినట్లు సుబ్బారావు గుటకవే సాడు.

'పిల్లికే తగిన మర్యాద చేయలేకపోయాను! తప్పే చెడీ ఈ సంబంధం కుదిరితే అల్లుడుగారికి తగిన మర్యాద చేయగలనో లేదో?' అన్న అనుమానం అతని మనసులో పొడసూపింది.

జరుగుతున్న సంఘటనలను గమనించడంలేదు సుందరరావు. 'ఈ ప్రపంచంలో వున్న అందం అంతా రాసిపోసినట్లు వుందీ అమ్మాయి. అమ్మా నాన్నా వొప్పుకుని ఈ సంబంధం ఖాయమైతే నాకంటే అదృష్టవంతులెవరుంటారు! ఏమందం! గుటకలు వేయించే అందం! గుండెకు గాలం వేసిలాగే అందం! ఏ దివ్యలోకాలలోనో విహరించే



రాజహంస బురద నీటిలో వచ్చి పడ్డట్లుంది ఈ అమ్మాయినీ ఇంట్లో చూస్తుంటే!'

నందయ్యకు సుందరరావు లిల్లీతను చూపు లతోనే తినేసేట్లు ఆర్తిగా చూడడం ఇష్టంలేకపో యింది.

'ఇల్లు చూస్తే అయ్యవారి నట్టిల్లులా వుంది. సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసి రిటైరయ్యాడంటే కనీసం అరకోటి అయినా వెనకేసుకుని వుండడా అనుకు న్నాను. ఇనపగజ్జెల తల్లి పాదం మోపినట్లు వుంది వాతావరణం. ఒకవేళ విజిలెన్ దాడి వస్తుందని సంపద దాచి వుంచాడేమో?' అని మనసులో; అనుకుని పైకి

"ఈ వూళ్ళో మీకు భూములేపాటి వుంటాయి" అని సుబ్బారావునడిగాడు.

"భూములేం లేవండి" నెమ్మదిగా సమాధానమి చ్చాడు సుబ్బారావు.

"అవున్లెండి- ఇప్పడు మాగాణి భూములెవరు కొంటున్నారు. అంతా నూజివీడు సైడు మామిడి తోటలకు, నెల్లూరుసైడు నిమ్మతోటలకు ఎగబ డుతున్నారు. ఎకరానికి అయిదువేల నుంచి పది హేనువేల వరకు ఆదాయం తీయవచ్చు! మీరు కూడా..." అర్థోక్తిగా ఆపాడు నందయ్య.

సుబ్బారావు ముఖం వెలాతెలాపోయింది.

క్షణంలో తనను తాను సంభాళించుకుని "లేదండీ- తోటలేం కొనలేదు" అన్నాడు.

"మంచి మాట చెప్పారు. ఈరోజుల్లో భూములు కొనడం అంత తెలివైన పనిగాదు. మనమూ చేయ లేము. ఇతర్లమీద ఆధారపడాలి. ఎందుకొచ్చిన లాయిలసా?! అంతకన్నా టౌన్స్‌లో బిల్డింగులు కట్టించుకోవడం మంచిది. టౌనులో ఆస్తులు ఏపాటి సంపాదించారేం?" గుంభనంగా అడిగాడు నందయ్య.

సుబ్బారావు క్షణం తటపటాయించాడు సమా ధానం చెబుదామా వద్దా అని. అప్రయత్నంగా భార్య విమలవంక చూచాడు. ఆమె ఉత్సవానికి అలంకరించిన అమ్మవారి విగ్రహంలా నగలు దిగే సుకు వచ్చిన బసవమ్మవంక ఆసక్తిగా చూడడం కనపడింది.

గొంతు పెగల్చుకుని "టౌనులో ఆస్తులేం సంపా దించలేదండి" అని బదులిచ్చాడు.

"కళ్ళకు కొట్టవచ్చినట్లు మేడలు కట్టించడం కూడా తెలివిగల పనికాదులెండి. మునిసిపల్ టాక్స్ విపరీతంగా పెంచిపారేసారు. ఇన్‌కంటాక్స్ రెయిడ్స్ సరేసరి. యమభటులన్నా వదిలిపెడతారు గాని విజిలెన్స్‌వాళ్ళు వదలరు-చెల్లెమ్మ పేరుతో షేర్లే మాత్రం కొన్నారు?" లౌక్యంగా అడిగాడు నందయ్య.

గొంతులో గులకరాయి పడ్డట్లు గిలగిలలాడాడు సుబ్బారావు. నందయ్య తన ఆస్తి వివరాలు సేకరిం చాలని చేస్తున్న ప్రయత్నం అతనికి ముచ్చెమటలు పట్టించింది. ఎలాగో గొంతు పెగల్చుకుని

"షేర్లు కొనలేదండీ" అన్నాడు హీనస్వరంతో.

"తెలివిగల పనిచేసారు. కడుపుకట్టుకుని డబ్బు సంపాదించుకుని తీసుకెళ్ళి షేర్లు కొంటే బిగ్ బుల్ మెహతాలు గుటకాయస్వాహా చేసేస్తారు! మన డబ్బు మన దగ్గరే వుంచుకుని అయిదురూ పాయల వడ్డీకిస్తుంటే కళ్ళుమూసి తెరిచేలోపల

కుప్పలు తెప్పలుగా పెరుగుతుంది. లక్ష్మీదేవికి కవి లెక్కట్టలంటే బహుప్రీతి! ఏమంటారు?"

సుబ్బారావుకేమనాలో తోచలేదు. అసలు అది ప్రశ్న అనిపించలేదు. అందుకే మిన్నకుండిపోయాడు.

"బులియన్ మార్కెట్ కూడా మంచిదే సుమండీ! బంగారం వెండీ కొని ఇంట్లో ఓ మూల పారేస్తే పాపం పెరిగినట్లు వాటి ధర పెరిగిపోతుంటుంది. వాటివంక తిరిగి చూడకుండా వుంటే చాలు" యథాలాపంగా అన్నట్లు వచ్చాయి నందయ్య నోటి నుండి మాటలు.

నందయ్య స్టేట్‌మెంట్‌కు జవాబు చెప్పాలో అక్కర్లేదో తెలీని సుబ్బారావు మనసులో ఇబ్బంది పడిపోసాగాడు. ఇంకా ఏం ప్రశ్నలు వేస్తాడో అని భయపడుతున్న సమయంలో బసవమ్మగారి గొంతు ఖంగుమని వినిపించింది.

"వొదినగారూ అమ్మాయికి నగలేం చేయించారు?" విమల ముఖం క్షణం వివర్ణమైంది. అంతలోనే తేరుకుని

"పెద్దగా నగలు చేయించలేదొదినగారూ" అంది సిగ్గుపడుతూ. పెళ్ళి సంబంధానికొచ్చినామె అంత డైరెక్ట్‌గా తననా ప్రశ్న వేస్తుందనుకోలేదామె.

"ఇప్పుడు వెనుకటి కాలం బంగారు నగలెవరు చేయిస్తున్నారులెండి. అవి మోటయిపోయి పెట్టుకోటానికి వీలుకాకుండా వున్నాయి. రవ్వలు పొదిగిన ప్లాటినం సెట్ ఒకటుంటే చాలు—శక్తి కొద్ది పది పదిహేను లక్షల్తో చేయించేసుకోవచ్చు!" బసవమ్మ యథాలాపంగా అన్న మాటలు విమలు వంటికి ముచ్చెమటలు పట్టించాయి.

బసవమ్మ దృష్టికి నగలేం లేని లోలిత ఏమాత్రం ఆనదని అనిపించిందామెకు.

'బంగారం లాంటి సంబంధం. బోలెడాస్తి ఒక్కడే కొడుకు. పిల్లవాడి తల్లివంటి మీదే ఇన్ని నగలున్నాయి! లాకర్లలో ఎన్ని నగలుంటాయో?! అవన్నీ తర్వాత కోడలుకే గదా వచ్చేది అనుకున్నాను. కాని అమ్మాయికి అదృష్టం వుండొద్దూ' అని విమల మనసులో మథనపడ్తున్న సమయంలో

"అమ్మా" అని సుందరరావు పిలిచి తల్లిని కొంచెం అవతలకు తీసుకువెళ్ళి మాట్లాడడం, బసవమ్మ అతను చెప్పినదానికి తలూపడం, తిరిగి వచ్చాక బసవమ్మ ముఖం ప్రసన్నంగా మారడం గమనించి వూరటపడింది.

"అమ్మాయి నీ పేరేమిటమ్మా?" బసవమ్మ గొంతులో వొలికిన ఆప్యాయతకు విమల మనసు కుదుటపడింది.

"లోలిత"

లోలిత సుందర రూపాన్ని చూచి ఆనందపడ్తున్న సుందరరావు మధురమైన ఆమె కంఠ ధ్వని విని మరింత సంతోషించాడు.

'ఈ అమ్మాయి మాట్లాడుతుంటే బంగారు కలశం నుండి మేలిమి ముత్యాలు ఒలికినట్లు వుంది' అనుకున్నాడు.

"ఎంతవరకు చదివావమ్మా?" బసవమ్మ లోలి తను మాట్లాడించాలన్న ఉద్దేశంతో తెలిసిన విషయాలనే మళ్ళీ అడుగసాగింది.

"ఎంఫిల్"

లోలిత చెప్పిన సమాధానం బసవమ్మకు అర్థం కాలేదు. ఆమె ఆ డిగ్రీ పేరెప్పుడూ వినలేదు.అయినా తనకా విషయం అర్థం కాలేదన్నది బయటపడకుండా పూర్తిగా తనకు తెలిసిన వాటి గురించి ప్రశ్నించుదామని

"వంట చేయగలవా?" అని అడిగింది.

తలూపింది లోలిత.

'ఇప్పుడు నీ విషయం బయటపడ్తుంది' అని మనసులో అనుకని "బర్ఫీ ఎలా చేస్తావమ్మా" అని అడిగింది బసవమ్మ.

లోలిత బర్ఫీ ఎలా చేయాలో చెప్పింది.

"అయితే వదినగారు నీకు వంట బాగా నేర్పారన్నమాట!" అంది బసవమ్మ మెచ్చుకోలుగా.

విమల పొంగిపోతూ "నాకలాంటివన్నీ చేయడం రాదొదినగారూ. అమ్మాయి సెలవుల్లో కొత్త కొత్త వంటకాలు చేస్తూ వుంటుంది. మా పినతల్లి కూతురు చాలా కొత్త వంటలు చేస్తుంది. అమ్మాయికి నేర్పింది" అంది.

"మరింకేం! వంటా వార్పూ నేనా-ఇంటి పనులు కూడా చేస్తుందా?"

"మా ఇంట్లో పనిమనుషులు, నౌకర్లు లేరు. అమ్మాయికి చిన్నప్పట్నుంచీ ఇంటిపనులు చేయడం అలవాటే!" నమ్రతగా జవాబిచ్చింది విమల. ఆమెకు ఎందుకో 'ఈ సంబంధం కుదురుతుందేమో?!" అని ఆశ కలుగసాగింది. అందుకు తగినట్లే అన్నది బసవమ్మ.

"మాకు ఇంటికి మించిన పనిమనుషులు నౌకర్లు వున్నారు— అమ్మాయి మా ఇంట్లో కాలుతీసి కాలు పెట్టవలసిన పని వుండదు"

భార్య ముందుగానే అలా కమిట్ అవడంవలన బేరసారాల విషయంలో బెట్టు తగ్గుతుందని అవతలవారి దృష్టిలో చులకన అవుతామనీ అనిపించిన నందయ్య గట్టిగా దగ్గి తన అసమ్మతిని బసవమ్మ దృష్టికి తెచ్చాడు.

భర్త ఇచ్చిన హింట్ గ్రహించిన బసవమ్మ మిన్నకుండిపోయింది.

కాని ఇదేదీ గమనించని సుందరరావు సోఫాలో సర్దుకుకూర్చుని "పాటలు పాడుతావా?" అని అడిగాడు. అతని గొంతు గాడిద ఓండ్రింపుకే నక్కవూళకు మధ్యస్థాయిలో వినపడి ఉలికిపడింది లోలిత.

లోలిత నుండి సమాధానం రాకపోయేసరికి సుందరరావు వీలున్నంత మార్దవంగా ప్రశాంతంగా గొంతు మార్చుకుని "హిందీ సినిమా పాటలు పాడుతావా?" అని ప్రశ్నను మార్చి అడిగాడు.

లోలిత చురుక్కున అతని ముఖంలోకి చూచి తలతిప్పకుందిగాని సమాధానం చెప్పలేదు.

తల్లికి నచ్చిన పిల్ల కొడుక్కి నచ్చకుండా పోతుందేమోనన్న భయంతో విమల "అమ్మాయి కర్ణాటక సంగీతం నేర్చుకుంది. త్యాగరాజ కృతులు పాడుతుంది. హిందీసినిమా పాటలు ఒకసారి వింటే పాడగలదు" అన్నది.

మళ్ళీ లోలితను ప్రశ్నించాలని ఉద్విగ్నుడవుతున్న సుందరరావు అప్రయత్నంగా తండ్రి వంక చూచి ఆ ప్రయత్నం మానుకున్నాడు, నందయ్య 'ఇక చాలు' అన్నట్లు తల నెమ్మదిగా అడ్డంగా తిప్పడం గమనించి.

నందయ్యగారు పెరట్లోకి నడుస్తూ "సుబ్బారావుగారూ— మాట" అని పిలిచాడు.

నందయ్య వెంట తండ్రి లోపలకు వెళ్ళిన రెండు నిముషాలకు లోలిత లేచి లోపలకు వెళ్ళింది.

ఆమెకు పెద్దగా మాట్లాడుతున్న నందయ్య మాటలు స్పష్టంగానూ,నెమ్మదిగా జవాబిస్తున్న తండ్రి మాటలు అస్పష్టంగానూ వినపడసాగాయి.

"బావగారూ—మావాడికి పి.డబ్ల్యుడి ఇంజనీరు గారు ఇరవై లక్షల్తో పిల్లనిస్తామని కబురు చేసారు. మీ అమ్మాయి బాగుంటుందని తెలిసి ఇలా వచ్చాం."

"చిత్తం"

"ఇంతకీ మీరేమాత్రం ఇచ్చుకోగలరు?"

"చిత్తం—ఒక్కగానొక్క ఆడపిల్ల— మాకున్న దంతా ఆమెకేగదా?"

"అంటే ఏమాత్రం ఇస్తారేం?"

"నా పిఎఫ్, గ్రాట్యుటీ తాలూకు డబ్బులో పెళ్ళి ఖర్చులు పోను రెండు లక్షలు, ఈ ఇల్లు."

"ఈ ఇల్లు ఎవరు కొంటారు? పడగొట్టి కలప అమ్మితే యాభై అరవై వేలు రావచ్చు."

"చిత్తం మాకున్న ఆస్తి ఇల్లేనండి."

"మీ అన్నఒకాయన టౌనులో వుండి ధాన్యం వ్యాపారం చేసి బాగా సంపాదించాడట."

"అవునండీ."

"ఆయనకు పిల్లలు లేరట."

"అవునండీ."

"ఆయన ఆస్తికి వారసులు మీరేగా?"

"ఏమోనండీ—ఆయన ఆస్తి ఆయన ఇష్టం—ఎవరికైనా ఇవ్వొచ్చు"

"ఆయన తన తదనంతరం ఆస్తి మీ అమ్మా

యికి చెందేట్లు వీలునామా రాసాట్ట!"

"అవునండీ!"

"చూడండి బావగారూ! పొదలో పడ్డ పిట్ట కంటే చేతికి చిక్కిన పిట్టకు విలువెక్కువంటారు. ఎప్పుడో ఆయన తదనంతరం ఆస్తివచ్చేప్పటికి ఎవరం వుంటామో ఎవరం వుండమో? అమ్మాయి పెళ్ళికి మీ అన్నగార్ని పది లక్షలు కాష్ ఇవ్వమనండి. మీ అమ్మాయిని మా కోడలుగా చేసుకుంటాం."

"అందుకు మా అన్నగారు వొప్పుకుంటారోలేదో"

"ఎందుకు వొప్పుకోరు? ఆయనకు మాత్రం ఎవరున్నారు!"

"నేను నా జీవితంలో దేహీ అని మా అన్నగారితో సహా ఎవర్నీ ఏమీ అడగలేదు. క్షమించండి. ఇప్పుడూ అడగలేను!"

"మాకు పాతిక లక్షల ఆస్తి వుంది. మా తాహతుకు తగిన కట్నం తీసుకోకపోతే నలుగురిలో మాకు తలవంపులు గాదూ? ఆలోచించండి."

తండ్రి మౌనం వహించడం కిటికీలోంచి చూచింది లోలిత.

అయిదు నిముషాల తర్వాత పెళ్ళి చూపులకు వచ్చినవారు వెళ్ళిపోయారు!

**ఆ రాత్రి లోలితగాని, విమలగాని, సుబ్బారావుగాని నిద్రపోలేదు.**

తెల్లవారగానే లేచి యూనివర్సిటీ హాస్టల్‌కు వెళ్ళింది లోలిత.రెండు గంటల తర్వాత అమెరికన్ యువకుడిని వెంటబెట్టుకుని తిరిగి వచ్చింది.

"నాన్నా ఈయన రాబర్ట్– మా యూనివర్సిటీలో ఓరియంటల్ హిస్టరీలో పి.హెచ్.డి. చేస్తున్నారు. ఈయన తండ్రి పూర్వీకులు ఐర్లండు నుంచి అమెరికా వలసవచ్చారట. తల్లి పూర్వీకులు ఫ్రాన్సు నుంచి అమెరికా వలసవచ్చారట. తల్లీ తండ్రీ ఇద్దరూ మద్రాసులోని అమెరికన్ కాన్సలేట్‌లో పనిచేస్తున్నారు.

"రాబర్ట్‌కు మనదేశమన్నా మన ప్రజలన్నా అమితమైన అభిమానం."

చాలాకాలం నుంచీ రాబర్ట్ నేనూ స్నేహితులం. ఒకరి అభిప్రాయాలు మరొకరం క్షుణ్ణంగా తెలుసుకున్నాం! ఇన్నాళ్ళూ అడుగుముందుకు వేయలేక మిన్నకుండిపోయాను. నిన్న పెళ్ళిచూపుల తతంగంతో నా కంటి ముందున్న భ్రమలు తొలగిపోయాయి!

"నిజాయితీగా ఉద్యోగం చేసి రిటైరయిన నీబోటి ఆనెస్ట్ ఆఫీసర్ల పిల్లలను పెళ్ళి చేసుకునే త్యాగధనులు కొరవైన ఈ దేశంలో వుండేకంటే నన్ను, నా వ్యక్తిత్వాన్ని గౌరవించే రాబర్ట్‌ను వివాహం చేసుకుని అమెరికా వెళ్ళిపోదామనుకుంటున్నాను!

నా నిర్ణయం నీకు కష్టం కలిగించదని, మనస్ఫూర్తిగా నువ్వు, అమ్మా నన్నూ, రాబర్ట్‌నూ దీవిస్తారని నమ్ముతున్నాను"

లోలిత మాటలకు సుబ్బారావు మనసులో ఆనందపడి నీళ్ళు చిప్పిల్లుతున్న కళ్ళతో లోలితను రాబర్ట్‌ను మార్చి మార్చి చూసాడు.

"అమ్మా లోలితా,నువ్వు ప్రపంచంలో ఎక్కడున్నా సుఖంగా సంతోషంగా వుంటేచాలు. నీకూ రాబర్ట్‌కూ ఎప్పుడూ నా ఆశీస్సులు వుంటాయి" అన్నాడు గద్గద కంఠంతో.

వాకిట్లో నిలబడ్డ విమల అంగీకార సూచకంగా తలూపింది.


# ఇంజనీర్స్ సిండికేట్





సొంత ఇల్లు తీరని కోరిక కాదు .... మా ద్వారా ఎంతో సులభం

కుకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీకి అతి దగ్గరలో
మధ్య తరగతి ఉద్యోగులకు
ఇంజనీర్స్ సిండికేట్ వారి పురోవరం

జనప్రియ అపార్ట్‌మెంట్స్





ప్రమోటర్లు :
కె. రవీందర్ రెడ్డి
డి. ఎస్. చంద్రమోహన్ రెడ్డి
డి. విజయ్ సేన్ రెడ్డి

టు బెడ్ రూమ్ ఫ్లాట్ కేవలం రూ. **93,600/-** మాత్రమే.

ENGINEERS SYNDICATE

4-1-214,
రిండెన్ గార్డెన్స్, రామ్‌కోటి,
హైదరాబాద్ – 500 001.
ఫోన్ : ఆఫీస్ : 230101 : 230202